ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023 5 అనంతపురం





పిడిఎఫ్ నుంచి పట్టభద్రుల స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న పోతుల నాగరాజు

కోలాహలంగా... పీడీఎఫ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు





పిడిఎఫ్ నుంచి ఉపాధ్యాయ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న కత్తి నరసింహారెడ్డి



నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి

- భారీగా తరలొచ్చిన మద్దతుదారులు
- గుత్తి రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపుదాం
- ముఖ్యమంత్రి మాటా తప్పాడు...మడమా తిప్పాడు...
- ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, సాబ్జి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పిడిఎఫ్ (ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల నియోజకవర్గానికి పోతుల నాగరాజులు బుధవారం నాడు అభిమానులు, మద్దతుదారుల కోలాహలం నడుమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, సాబ్జి, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ గేయానంద్, జల్లివిల్సన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. గుత్తిరోడ్డులోని చలమారెడ్డి ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను



నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు

చట్టసభలకు పంపిచాలన్నారు. మాట తప్పను.. మడమ తిప్పను .. అన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్కమాటను నిలుపుకోలేదని చెప్పారు. ఆయన మాటా తప్పాడు...మడమా తిప్పాడూ అని ఎద్దేవా చేశారు. చట్ట సభల్లో ప్రజా సమస్యలపై ఇప్పుడు చర్చ జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. అవి బూతుల సభలాగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని గుర్తు చేశారు. ఈ బలాన్ని మరింత పెంచే విధంగా ఇక్కడికొచ్చిన ప్రజాసంఘాలన్నీ కలిసి పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించి మండలికి పంపాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించగలం అన్నారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ మండలి ఎన్నికలు కౌరవులు, పాండవులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించేందుకు అధికారపార్టీ సాయశక్తులను ఒడ్డుతోందని చెప్పారు. దీన్ని ప్రజా సంఘాల ఐక్య బలంతో తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఇన్ని ప్రజాసంఘాలు వచ్చి తమ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతోనే తమకు నైతిక విజయం లభించినట్టయిందన్నారు. అధికార వైసిపి ఈ ఎన్నికల్లో ఏదో రకంగా గెలుపొందేందుకు సర్వశక్తులు ఒడ్డుతోందన్నారు. కొంతమంది అధికారులను ఇక్కడికి పంపి ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ఇప్పటికే చేస్తోందన్నారు. దీన్ని ప్రజా సంఘాల నాయకులు తిప్పికట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికలకు సమయం తక్కువగానున్న సమయంలో మరింత అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని తెలిపారు. ఈ సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పటికప్పుడు మండలిలో పోరాటం సాగించామని గుర్తుచేశారు. సిపిఎస్‌పైనా, పిఆర్‌సిపైనా మండలిలో గొంతెత్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఈ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్టీయు, ఐద్వా, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నామినేషన్‌కు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు, పిడిఎఫ్ మద్దతుదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ఫైనల్ ఇయర్ ఎంబిబిఎస్ ఫలితాల్లో
మెరిసిన అనంత ఆణిముత్యాలు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో అనంత మెడికోలదే హవా

ఫైనల్ ఇయర్ ఎంబిబిఎస్ ఫలితాలలో రాష్ట్రంలోనే అనంతపురం మెడికల్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మెడికల్ కళాశాల చరిత్రలోనే డిస్టింక్షన్‌లో పాసైన మొట్టమొదటి ఫైనల్ ఇయర్ మెడికల్ స్టూడెంట్స్‌గా రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఫైనల్ ఇయర్ ఎంబిబిఎస్ పార్ట్-2 పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలను ఇక్కడ ఫైనల్ ఇయర్ చదువుతున్న 2018వ బ్యాచ్ వైద్య విద్యార్థులు సాధించడం కళాశాల ప్రగతికి నిదర్శనమన్నారు. ఇంత మంచి విజయాన్ని కళాశాలకు అందించినందుకు 2018వ బ్యాచ్ వైద్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల చరిత్రలోనే ఫైనల్ ఇయర్‌లో ఇద్దరు డిస్టింక్షన్లు సాధించడం, 68 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం ఇదే ప్రథమమని తెలిపారు. ఇది తమ వైద్య కళాశాల ప్రగతికి సోపానమని అన్నారు. మొత్తం 103 మంది పరీక్షకు హాజరు కాగా 98 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అందులో ఇద్దరు విద్యార్థులు ఎస్. అఖిల, కె.భావన లు డిస్టింక్షన్‌లో పాస్ అయ్యారన్నారు. 68 మంది ప్రథమ శ్రేణిలో, 28 మంది ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. కె.భావన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్ విభాగాలలో మూడు గోల్డ్ మెడల్స్ సాధించి డిస్టింక్షన్‌లో పాస్ కావడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. గైనకాలజీ విభాగంలో ఎండ్లూరి చిద్విలాస్‌కు గోల్డ్ మెడల్, జనరల్ మెడిసిన్ విభాగంలో రశ్మీ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. ఉపాధ్యాయుల అత్యుత్తమ బోధన, విద్యార్థుల ప్రతిభ ఇంత మంచి విజయాలు సాధించడంలో దోహదపడ్డాయని తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య పర్యవేక్షకులు ఆచార్య డాక్టర్ రఘునందన్, సహాయ పర్యవేక్షకులు ఆచార్య డాక్టర్ రామస్వామి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, ఆచార్య డాక్టర్ కెఎల్.సుబ్రమణ్యం, ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, ప్రొఫెసర్లు, ఇతర వైద్య సిబ్బంది, మెడికోలను అభినందించారు.

జగనన్న గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీల్లో పేద ప్రజలకు కేటాయించిన గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని ఆర్డీటీ కాలనీలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని పేద ప్రజలకు మంజూరైన గృహాలు అన్నింటికీ విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించి త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు



కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తీసుకోవాలని అధికారులను ఆదేశాంచారు. సిఎం జగన్మోహనరెడ్డి ఇంతవరకు రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల ఇళ్ల పట్టాలిచ్చిన సంగతిని పక్కనపెట్టి సెంటు భూమి కూడా ఇవ్వలేని టీడీపీ విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 21 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఆలూరు రామేశ్వర్‌రెడ్డి, వంగనూరు సూరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-బెలుగుప్ప


జగనన్న ఇళ్ల నిర్మాణాలలో హౌసింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయన్నారు. జగనన్న ఇళ్లను



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

త్వరగా పూర్తిచేసేందుకు హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాప్యం లేకుండా వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చూడాలన్నారు. వైస్ ఎంపిపీ పుష్పావతి, తహశీల్దారు ఈశ్వరయ్య శెట్టి, ఎంపీడీవో యాదవేంద్ర, ప్రజా ప్రతినిధులు శివలింగప్ప, రామాంజనేయులు, శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సిఫార్సులకే సాగుపట్టా..!



- భూ పంపిణీలో సాగదారులకు అన్యాయం
- ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే పట్టాలు
- ఏళ్లతరబడి సాగులో ఉన్నా ప్రయోజనం శూన్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఏళ్ల తరబడి సాగులో ఉన్న పేద రైతులు భూమి పట్టాల కోసం వేచి చూస్తున్నారు. ఎప్పుడో ఒక సారి పట్టా వస్తుందని గంపెడు ఆశతో ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చారు. అయినా నేటికీ వారికి సాగు పట్టాలు చేతికందలేదు. ఈ సారి ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ పంపిణీలో అయినా తమకు న్యాయం జరిగుతుందని రైతులు అధికారులకు అర్జీలను ఇచ్చారు. అయితే ఇక్కడ కూడా సాగుదారులకు అన్యాయం జరుగుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బొమ్మనహాల్ మండలంలో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. మండలంలోని 15 రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ పంపిణీ మొదటి విడత పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఎంపిక చేసిన గ్రామాల్లో భూములకు సంబంధించి సాగులో ఉన్న రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చేలా అధికారులు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇక్కడే కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు అవినీతికి తెరలేపినట్లు తెలుస్తోంది. సాగుచేస్తున్న వారిని కాకుండా అనర్హులను జాబితాలో చేరుస్తున్నట్లు సమాచారం. ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలకు అవసరమైన వారి బంధువులు, స్నేహితుల నుంచి మాత్రమే అర్జీలను సేకరించి పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి తెరలేపారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న అర్హులైన వారు పట్టాలు పొందాలన్నా సంబంధిత నాయకులు, అధికారులకు డబ్బులు చెల్లించక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇలా ఒక్కో రైతు ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

బొమ్మనహాల్ మండల పరిధిలోని నేమకల్ గ్రామం 85 సర్వేనెంబర్‌లో 282 ఎకరాలు అసైన్డ్ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూమి పంపిణీ నిమిత్తం రైతుల నుంచి 142 అర్జీలు వచ్చాయి. అర్జీలు ఇచ్చిన వారిలో భూమి సాగు చేస్తున్న రైతులు కేవలం 24 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన వారు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంది. శ్రీధరగట్ట గ్రామం సర్వేనెంబర్ 265లో 27 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కళ్లదేవనహళ్లి గ్రామంలోనూ అసైన్డ్ భూమిని గుర్తించి దీని పంపిణీ నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మండల వ్యాప్తంగా సుమారు 5000 మంది చిన్న, సన్నకారు రైతులు సాగుభూముల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు వారి అర్జీలను పక్కన బెట్టి సిఫార్సులు, డబ్బులు ఇచ్చిన వారికే భూ పంపిణీలో పేర్లు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి మండలంలోని గోవిందవాడ, బొల్లనగుడ్డం, సింగానపల్లి, బండూరు, అరేసముద్రం, కురవల్లి, ఉద్దేహాల్, దర్గాహొన్నూరు గ్రామాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. సాగుదారులకు అన్యాయం చేసి, అనర్హుల పేర్లను జాబితాలో చేర్చడంపై నిరసన వ్యక్తం అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి భూ పంపిణీ జాబితాపై సమగ్ర విచారణ జరిపి అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

టిడిపి కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

ప్రజాశక్తి-పుట్లూరు

గన్నవరం టిడిపి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి అప్రజాస్వామికమని, నిందితులపై కేసులు నమోదు చేయాలని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు డిమాండ్ చేశారు. ఎ.కొండాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడిపి కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వైసిపి నాయకులను విడిచిపెట్టి టిడిపి నాయకులపైనే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రవిచంద్ర నాయుడు, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివశంకర్‌రెడ్డి, తీర్థమయ్య, లక్ష్మయ్య, రామాంజనేయులు, పెద్దయ్య, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెద్దాం : కందికుంట

ప్రజాశక్తి-తనకల్లు

వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేద్దామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్ఎం ఎన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన మండలస్థాయి టిడిపి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను గాలికి వదిలి సైకోలా వ్యవహరిస్తూ పాలనను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలని, పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచకాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం వాలెంటీర్ల చేత ప్రజలను బెదిరిస్తూ గృహసారథుల పేరిట మరికొంతమందిని నియమించి తెలుగుదేశం పార్టీకి చెందిన ఓటర్లను బెదిరించడానికి, వినకపోతే ఓటర్లను తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాటిని అడ్డుకోవడానికి బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలకు ఎటువంటి సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అబ్జర్వర్ నాగేంద్ర బాబు, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు బీగం శంకర్ నాయుడు, మునెప్ప, బడా రాజారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు దేశాయి ప్రభాకర్ రెడ్డి, దేశాయ్ హరినాథ్ రెడ్డి, సోంపాలెం నాగభూషణ, కుంచె నాగేంద్రప్రసాద్, తోట సరోజమ్మతో పాటు వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసింహస్వామి కల్యాణం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీ భూనీలా సమేత నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం కమనీయంగా జరిగింది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం గంగపూజ, గణపతి పూజ నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి తరలివచ్చి స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

రక్తదానం

ఉరవకొండ : వజ్రకరూరు మండలం జరుట్ల రామపురం గ్రామానికి చెందిన ఓ గర్భిణికి ఎ-నెగటివ్ రక్తం అవసరం కావడంతో వారు ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులను సంప్రదించారు. ట్రస్టు సభ్యులు విజయ్‌కుమార్ ఆమెకు రక్తదానం చేశారు. సకాలంలో రక్తదానం చేసిన ఆపద్బాంధవ ట్రస్టు నిర్వాహకులకు గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్‌అసిస్టెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ.. మండలంలోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. ప్రతిరోజూ 2 వేల మందికి పైగా కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. పని ప్రదేశం నుండి రెండు ఫొటోలు తప్పనిసరిగా పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టిఎలు, ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో :
E.P.No.116/2022 in O.S.No. 05/2021
K.వెంకటేశ్వర్లు. ...D.Hr
-Vs-
J.Dr No.2:
B.ప్రకాష్ తండ్రి డానియేల్ ...J.Dr
Railway Quarters No. 634/D,
శాంతినగర్, గుంతకల్ టౌన్, అనంతపురం జిల్లా.
పై కేసు నందు రెండవ ప్రతివాది పై డిక్రి అమలు కోరి వాది దావా మొత్తము రాబట్టుకొనుటకు తన జీతం నుండి జప్తు కోరుతూ పలుమార్లు పై కోర్టు వారు ఎన్ని సార్లు నోటీసు పంపిన మీరు తీసుకోవటం లేదు. కావున వాది తరపున పత్రిక ముఖముగా కోర్టు వారు ఆర్డర్ చేసియున్నారు. వాయిదా తేది 14.03.2023న ఉన్నది. కావున సదరు మీరు ఆ దినము 10.30 మీరు కాని మీ తరపు వకీలు గాని ఆక్షేపణలు యుంటే తెలుపు కోగలరు. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 14-03-2023
కె.గోపాల్, అడ్వకేట్,
డోన్ - 518 222, నంద్యాల జిల్లా.
సెల్ : 8341420706, 9390298585

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
S.O.P.No.6/2022
Between:
1) వెన్నపూస జయమ్మ
2) వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి
3) వెన్నపూస అనిమిరెడ్డి
4) మూల లక్ష్మీదేవి ...అర్జీదారులు
V/s
..నిల్.. రెస్పాండెంట్
పబ్లిక్ నోటీసు
పై అర్జీలో 1వ అర్జీదారులారికి భర్త అయిన మరియు 2 నుంచి 4 అర్జీదారులకి తండ్రి అయి 24-11-2021వ తేదీ చనిపోయిన వెన్నపూస శంకర్‌రెడ్డికు ఎం.శ్రీనాథ్‌రెడ్డి అను అతని నుంచి రావలసిన ప్రోనోటు తేది:06-04-2021 బాపతు మొత్తమును రాబట్టుకొనుటకు దావా వేయడానికి అవసరమైన "వారసత్వపు సర్టిఫికెట్" పొందు నిమిత్తము పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసి ఉన్నారు. సదరు అర్జీమీద ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నచో 10-03-2023వ తేదీన పై కోర్టు ఎదుట స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 గంటలకు హాజరయి మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును లేని యెడల కోర్టువారు రికార్డుల ఆధారముగా తీర్మానము చేయుదురు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
సి.రమేష్‌నాథరెడ్డి, ఎం.ఏ, ఎం.ఎల్.
వై.హనీఫ్ బాష,, బి.కామ్, ఎల్.ఎల్.బి
న్యాయవాదులు, తాడిపత్రి.
జెడ్.సతీష్, బి.ఏ, ఎల్.ఎల్.బి
న్యాయవాది, గుత్తి.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.A.NO.155/2022 in O.S.NO.91/2022
Between:
1. గన్నె రంగనాథం S/o లేట్ జి.రంగయ్య, వయస్సు:60 సం॥రాలు R/o కోదుమూర్తి (గ్రామము), యల్లనూరు (మండలం), అనంతపురం జిల్లా. ...వాది
V/s
కుమ్మెత జయరామిరెడ్డి మరియు 27 మంది ఇతరులు
1) యల్లపు అరుణకుమారి (D4) W/o సన శ్రీనివాసులు, వయస్సు:46 సం॥రాలు, డోర్‌నెం.3-736-2, 5th Cross, క్రిష్టాపురం రోడ్, తాడిపత్రి టౌన్, అనంతపురము (జిల్లా).
2) వల్లపు లక్ష్మీదేవి (D20) W/o వల్లపు బాలుడు, వయస్సు:61 సం॥రాలు, డోర్‌నెం.15-714-2, 15వ వార్డు, భగత్‌సింగ్ నగర్, తాడిపత్రి టౌన్, అనంతపురము (జిల్లా).
3) సరోజ్ రవి ప్రసాద్ (D26) S/o రామచంద్రరావు, వయస్సు:53 సం॥రాలు, డోర్‌నెం.6/274, గాజులపాలెం, తాడిపత్రి టౌన్, అనంతపురము (జిల్లా). ...ప్రతివాదులు
4వ, 20వ, 26వ ప్రతివాదులకు సమన్లు
వాది అయిన గన్నె రంగనాథం గారు ప్రతివాదులైన కుమ్మెత జయరామిరెడ్డి మరియు 27 మంది ఇతరులు ప్రతివాదులైన మీ పైన తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు నందు I.A.NO.155/2022 in O.S.No.91/2022 దావా దాఖలు చేసుకొని ఉన్నారు. పై దావాలో 4వ, 20వ, 26వ ప్రతివాదులు అయిన మిమ్ముల్ని 1)యల్లపు అరుణకుమారి 2)వల్లపు లక్ష్మీదేవి 3)సరోజ్ రవిప్రసాద్ లను చేర్చియున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను మీరు తిరస్కరించుచున్నారు. కావున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తము 02-03-2023వ ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గానీ మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
దగ్గు శివయ్య, బి.కామ్., ఎల్.ఎల్.బి.
కెత్రి వెంకటరమణ, బి.కామ్., ఎల్.ఎల్.బి.
పి.సురేష్ నాయుడు, బి.కామ్., ఎల్.ఎల్.బి.
వాదిపరం న్యాయవాదులు, తాడిపత్రి.

పదవి వారిది..పెత్తనం వీరిది..!

సతులకు బదులు పతులు హాజరు
ఇది సర్వసభ్య సమావేశం తీరు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

వారు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు కాదు.. ప్రజా పథానికి రమ్మని అధికారులు వారికి ఆహ్వానం పంపలేదు. అయినా వచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పవిత్ర వన్నూరుస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మహిళా సర్పంచులు, ఎంపిటిసిలు గైర్హాజరు అయితే వాళ్ల స్థానంలో వారి భర్తలు హాజరయ్యారు. అంతేకాకుండా అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కావడం విశేషం. సర్వసభ్య సమావేశం అంటే అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావలసి ఉంది. అయితే ఈ సమావేశంలో మాత్రం అన్ని శాఖల కంటే ముఖ్యమైన వ్యవసాయ శాఖ అధికారి హాజరు కాలేదు. కానీ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రం హాజరు కావడం విశేషం. ఈ సమావేశాన్ని చూస్తే సర్వసభ్య సమావేశంలా లేదు. కేవలం అధికార పార్టీ సమావేశం మాదిరిగా ఉన్నట్లుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పవిత్ర వన్నూరుస్వామి మాట్లాడుతూ వేసవికాలం మొదలవుతుందని మండలంలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ బసవ కుమార్, జెడ్పిటిసి హసీనాభాను, వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి పవిత్ర వన్నూరుస్వామి

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ తదితరులు

ప్రజాశక్తి-గుత్తి

గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో చిత్రా శ్రీనివాసులు ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీవో మద్దిలేటితో కలిసి మండలంలోని ఉపాధి సిబ్బంది ఈసీ, సాంకేతిక, క్షేత్ర సహాయకులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ ఉపాధి పనులకు వస్తున్న కూలీల సంఖ్యను వేసవికి ముందే పెంచాలన్నారు. కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. కూలీల సంఖ్య పెంచి పనుల లక్ష్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే చోట వసతులు కల్పించాలని అన్నారు. పనికి తగ్గ కూలి వచ్చేలా పనులు కల్పించాలన్నారు. వచ్చే వేసవిలో కూలీలకు మజ్జిగ, తాగునీరు, నీడ కల్పించేందుకు టెంట్లు ఏర్పాట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు లోకేష్, రత్నాలు చెన్నారెడ్డి, మైసూరా రెడ్డి, క్షేత్ర సహాయకులు రంగయ్య, సాయి, ఈశ్వర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ఉరవకొండ : ఆసక్తి కలిగిన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 27వ తేదీ లోపు ఓపెన్ ఇంటర్ చదువుకోడానికి దరఖాస్తు చేసుకోవాలని ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మమత కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ లోపు విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2023 ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జనరల్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1400, మైగ్రేషన్, టిసి ఫీజు రూ.200, అపరాధ రుసుముతో రూ.500 చొప్పున మొత్తం రూ.2300 చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరి విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1100, మైగ్రేషన్ కం టిసి ఫీజు రూ.200, అపరాధ రుసుము రూ.500 చొప్పున ఒక్కొక్కరు మొత్తం రూ.2000 ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యయన కేంద్రంలో కాని, జిల్లా కార్యాలయంలో కాని సంప్రదించాలని సూచించారు.

పండ్ల తోటల పరిశీలన

పెద్దపప్పూరు : మండలంలోని అమ్మలదిన్నె, జూటూరు గ్రామాల పరిధిలోని దానిమ్మ, పూల తోటలు, కూరగాయల తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.రఘునాథరెడ్డి, సహాయ సంచాలకులు బి.నరసింహారావు, తాడిపత్రి డివిజన్ ఉద్యాన శాఖ అధికారిని ఉమాదేవి, సహాయకులు రవితేజ బుధవారం పరిశీలించారు. దానిమ్మ తోటను ఆశించే బ్యాక్టీరియా, మచ్చ తెగులుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

గవిమఠం రథోత్సవం ఏర్పాట్లపై సమీక్ష



సమాక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్ర

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలో మార్చి 1, 2 తేదీల్లో జరగనున్న గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం ఏర్పాట్లపై స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గుంతకల్లు ఆర్డీవో రవీంద్ర, మఠం అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులను ఉద్దేశించి ఆర్డీవో మాట్లాడుతూ రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు జరగకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చే భక్తులకు మఠం సిబ్బంది మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటూ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రథోత్సవానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తాగునీటి సరఫరా శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రథం ఫిట్నెస్‌కు సంబంధించి రోడ్లు భవనాల శాఖ, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. రథోత్సవం పరిసర ప్రాంతాల్లో ఎక్కడా ప్రచార కార్యక్రమాలు చేయరాదని, దీనికి నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆర్టీసీ సంస్థ అవసరమైన ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. అన్ని శాఖల సహకారంతో రథోత్సవం, లంకా దహనం కార్యక్రమాలు ప్రశాంతంగా విజయవంతంగా జరగడానికి కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఉరవకొండ తహశీల్దారు షాబుద్దీన్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటస్వామి, డిప్యూటీ తహశీల్దారు గురుప్రసాద్, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గృహసారథులే వారధులు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రభుత్వానికి వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వారధులు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసిపి అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జగన్ మాట ఇస్తే నెరవేరుస్తాడన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్ అని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇదే నినాదంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కొత్తగా నియమించిన గృసారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైసిపి జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి-ఆత్మకూరు, అనంతపురం

ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతిని ఎపి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్ద బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుకర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారిని ఎదిరించి ముప్పుతిప్పలు పెట్టించి ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారన్నారు. దేశంలో ఆంగ్లేయులను ఎదిరించి తొలి స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. సిపాయిల తిరుగుబాటుకు అపదేళ్ల ముందే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీ జెర్రేటి వద్ద బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను బహిరంగంగా ఉరితీసిందన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తలని 30 ఏళ్లపాటు కోయిలకుంట్ల కోటలో ఊరివాకిట వేలాడదీశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి పేరు మీద పోస్టల్ స్టాంపును కూడా విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గట్టి రెడ్డి బయపరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుకరరెడ్డి, జిల్లా అధ్యక్షులు రేనాటి నాగేశ్వరరెడ్డి, ప్రచార కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రేనాటి వెంకటరామిరెడ్డి, కార్యవర్గ సభ్యుడు పాటిల్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎపి రెడ్డి సంఘం నాయకులు

తాడిపత్రిలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి నియోజకవర్గంలోని పాఠశాలల విద్యార్థులకు ఆర్‌డిటి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిటి కోచ్ భార్గవ్ తెలిపారు. ఈనెల 27వ తేదీ నుండి తాడిపత్రి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తామని చెప్పారు. పాఠశాలల ఉపాధ్యాయులు తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మ్యాచ్‌లు అన్నీ 10 ఓవర్లు నిర్వహిస్తామన్నారు. ఫైనల్ మ్యాచ్ మాత్రం 15 ఓవర్లు ఉంటుందని చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన జట్లు తమ ఆటగాళ్ల స్టడీ సర్టిఫికెట్స్, స్కూల్ గుర్తింపు కార్డు మ్యాచ్ సమయంలో చూపించాల్సి ఉంటుందని తెలిపారు. తాడిపత్రి ఎటిఎల్ రామాంజనేయులు, సీనియర్ కోచ్ సాదిక్ వలి, ఆర్‌డిటి క్రికెట్ కోచ్ భార్గవ్‌ల ఫోన్ నెంబర్లు 9347640651, 9490677916, 9182453357 లను సంప్రదించి ఆయా పాఠశాలలకు చెందిన జట్ల వివరాలు తెలియజేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పొలానికి కాపలా వెళ్లి వ్యక్తి మృత్యువాత



మృతుడు మాధవయ్య

ప్రజాశక్తి -ఆత్మకూరు

పొలం వద్దకు కాపలా వెళ్లి వ్యక్తి మృత్యువాత పడిన సంఘటన ఆత్మకూరు మండలం సనప గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు... సనప గ్రామానికి చెందిన బావికాటి హనుమంతు కుమారుడు మాధవయ్య (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి 4.30 ఎకరాల భూమి ఉంది. అందులో వేరుశనగ పంట వేశారు. వేరుశనగకు పందుల బెడద ఎక్కువ కావడంతో మంగళవారం రాత్రి పొలం వద్దకు కాపలా వెళ్లాడు. ఉదయం ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తోటకు వెళ్లి పరిశీలించారు. విగతజీవిగా పడివున్న మాధవయ్యను చూసి విలపించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సబ్సిడీ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరం గ్రామ సమీపంలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిపోతున్న 41 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యాన్ని విజిలెన్స్ సిఐ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ అక్షయను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ బియ్యం ఎవరివి, ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారో పూర్తిస్థాయి విచారణ చేపడతామని సిఐ చెప్పారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏఈ వీరేంద్ర, ఉరవకొండ సిఎస్‌డిటి రమేష్ బాబు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

స్థానిక రామకోటి కాలనీలోని చౌడేశ్వరి గుడి ఆలయం వద్ద చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. బడ్జెట్‌లో చేనేతకు రూ.1000 కోట్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత జన సమాఖ్య మండల గౌరవాధ్యక్షులు చందా చితంబరి, చేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు చింతా పురుషోత్తం, మండల నాయకులు ప్రసాద్, కేశవ, పూజా లక్ష్మయ్య, చింతా సాంబశివుడు, శివ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా నీలూరి రుషింగప్ప

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా నీలూరి రుషింగప్పను నియమించినట్లు జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున తెలిపారు. చేనేత కుటుంబ సభ్యులు అందరూ ఆయనకు సహకరించాలని కోరారు.

పోతలయ్యస్వామి పూజలో శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం పసులూరు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పోతలయ్యస్వామి ఆలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణీశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పసుపుల హనుమంతరెడ్డితో కలిసి ఆమె ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు పి.రామకృష్ణారెడ్డి, గంపన్న, చాముండేశ్వరి, ఈరప్ప, టి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి


ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు, రేణుమాకులపల్లి గ్రామాల్లో పనిచేస్తున్న తమకు బకాయి వేతనాలు చెల్లించాలని వాలంటీర్లు కోరుతున్నారు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదని వాలంటీర్లు వాపోతున్నారు. గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నప్పటికీ స్థానిక పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో అవి అందడం లేదని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని వాలంటీర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

హమాలీల కూలి ప్రభుత్వమే భరించాలని వినతి

ప్రజాశక్తి-బెలుగుప్ప

రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు అన్‌లోడ్ చేసే హమాలీల కూలి డబ్బులను ప్రభుత్వమే భరించాలని మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ.. హమాలీలు ఫ్రీగా అన్‌లోడ్ చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, మాలపాటి శివయ్య, లక్ష్మిరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: GOOTY
S.O.P. N0.1/2023
Betwen:
Kuragayala Padmavathi W/o Late K.Satyanarayana, D.No.15/950, Water Tank Road, Tadipathi Ananthapuramu District. ...Petitioners
NIL ...Respondents
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు కేసులో అర్జీదారులు యొక్క భర్తగారైన సత్యనారాయణ కూరగాయల అనువారు చనిపోయి నందు వలన వారి జీవితకాలంలో షెడ్యూలులో తెలిపిన షేర్స్ మొత్తమును తీసుకొనుటకు పై కోర్టులో అర్జీదారులు వారసత్వపు సర్టిఫికెట్ కొరకు అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 10-03-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా ఉన్నది. కావున ఈ విషయంలో ఎవరికైన ఆక్షేపణలున్నయెడల పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరుకావలెను. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానము చేయబడును.
షెడ్యూలు:
1.Name of the Compay:Reliance Industries Limited, Name of the Share Holders: Satyanarayana Kuragayala, Regd Polio: 029372837, Qty:624, Face Valu: Rs.10/-, Total Value as per FV:6,240/-
(By Order of the Court)
V.J. RAVIKUMAR, M.D.ZIAUDDIN
Advoctes, Ananthapuramu
Cell:9440693746.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: GOOTY
S.O.P. N0.2/2023
Betwen:
R.Upendra S/o Pullagari Kondaiah, D.No.1/1163, Main Bazar, Gooty. Ananthapuramu District. ...Petitioners
NIL ...Respondents
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు కేసులో అర్జీదారులు యొక్క తండ్రిగారైన ఆర్.పి. కొండయ్య అనువారు చనిపోయి నందు వలన వారి జీవితకాలంలో షెడ్యూలులో తెలిపిన షేర్స్ మొత్తమును తీసుకొనుటకు పై కోర్టులో అర్జీదారులు వారసత్వపు సర్టిఫికెట్ కొరకు అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 10-03-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా ఉన్నది. కావున ఈ విషయంలో ఎవరికైన ఆక్షేపణలున్నయెడల పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరుకావలెను. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానము చేయబడును.
షెడ్యూలు:
1.Name of the Compay:Hindusthan Lever Limited, Name of the Share Holders: R.P.Kondaiah, Regd Polio:2736754, Qty:500, Face Valu: Rs.1/-, Total Value as per FV:500/-
(By Order of the Court)
V.J. RAVIKUMAR, M.D.ZIAUDDIN
Advoctes, Ananthapuramu
Cell:9440448591, 9440693746.

ఆఖరి రోజు వెల్లువెత్తిన నామినేషన్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆఖరి రోజు శాసనమండలి ఎన్నికలకు నామినేషన్లు వెల్లువెత్తాయి. ఉపాధ్యాయ, పట్టభద్రులతోపాటు, స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి అన్ని రాజకీయపార్టీలు అట్టహాసంగా నామినేషన్ల దాఖలు చేశాయి. వైసిపి పట్టభద్రుల నియోజకవర్గానికి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గానికి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల మండలికి మంగమ్మలు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు జిల్లా మంత్రి ఉషచరణ్‌శ్రీ, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. టిడిపి అభ్యర్థిగా రామగోపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పిడిఎఫ్ తరుపున పట్టభద్రులకు పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా ఆఖరి రోజు 46 నామినేషన్లు దాఖలయ్యాయి.





నామినేషన్లు వేస్తున్న వైసిపి, టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థులు